ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# ఆంధ్రమహాభారతం – విస్మృత రాయబారాలు

రచయిత 1 డా. మల్లిపూడి రవిచంద్ర, 9573449282

(అధ్యాపకులు, తెలుగుశాఖ & కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ICSSR మైనర్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం)

రచయిత 2 డా. ఎస్. సుశీల్ కుమార్, 8142111668

(సహాయ ఆచార్యులు, భాషాశాస్త్రశాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం & కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ICSSR మైనర్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం)

రచయిత 3 డా. గరికిపాటి గురజాడ, 9010176407

(సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ & ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ICSSR మైనర్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం)

Article Received: 15/01/2026

Article Accepted: 25/02/2026

Published Online: 26/02/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3175

[This article was published as part of an ICSSR Minor Research Project. "Andhra Mahabharata Udyoga Parvam – Doutya Vidhaanam – Samakaaleena Samanvayam (Relevance and Application of Diplomacy Depicted in Udyoga parva of Mahabharat (Telugu version)), File No.118/2024-25/ICSSR/RP/MN/GEN]

## 0. వ్యాస సంగ్రహం

ధార్మికం, ఆధ్యాత్మికం, తాత్త్వికం, నైతికం, సామాజికం, కవిత్వం... వంటి ఎన్నో విషయాలకు *ఆంధ్ర మహాభారతం* ఆలవాలం. వాటన్నిటిని అనేక కోణాలల్లో వందల పరిశోధనలు వెలికితీశాయి. అయినప్పటికీ *మహాభారతం*లో పరిశోధన చేయవలసిన కోణం ఎప్పుడూ ఒకటి మిగిలే ఉంటుంది. జరిగిన పరిశోధనలలోనే మరో కొత్తకోణం స్ఫురిస్తూ ఉంటుంది. అలాంటిదే మహాభారతంలోని విస్మృత రాయబారాలు. రాయబారాలు అనగానే మనకు మహాభారంలోని రాయబారాలు, *మహాభారతం*లోని రాయబారాలు అనగానే ఉద్యోగ పర్వంలోని రాయబారాలు అందునా శ్రీకృష్ణుని రాయబారం మాత్రమే స్ఫురణకు వస్తుంది. కానీ *మహాభారతం*లో ఇంకా చాలా రాయాబారాలు ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకొనే ముందు అసలు రాయబారం అంటే ఏమిటి? *మహాభారతం*లో రాయబారాలు ఏయే సందర్భాలలో జరిగాయి? వంటి వాటిని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

తెలుకొంటే వాటిలో విస్మరించబడిన రాయబారాలు ఏమిటనేది తెలుస్తుంది. ఆ కోణంలో ఈ పత్ర విశ్లేషణ ఉంటుంది.

**కీలక పదాలు:** ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం**,** రాయబారాలు, ఆరణ్యపర్వం, దూత లక్షణాలు, నన్నయ, నలుడు

**1. పరిచయం**

రాయబారం మాట ఎత్తగానే అందరికీ టక్కున గుర్తుకు వచ్చేది *మహాభారతం*లోని శ్రీకృష్ణరాయబారమే. ఆ ఘట్టంలో శ్రీకృష్ణుడు చూపించిన నేర్పు, నైపుణ్యం, వాక్చాతుర్యమే రాయబారమంటే శ్రీకృష్ణరాయబారమే అనేంతగా ప్రజలలో నాటుకుపోయింది. ఆ తరువాత ప్రపంచం మొత్తానికి శ్రీకృష్ణరాయబారం ఆదర్శమయ్యింది. అందుకే శ్రీకృష్ణరాయబారంపై తెలుగులో వివిధ ప్రక్రియలలో అనేక రచనలు వచ్చాయి. ఎన్నో సినిమాలు వచ్చాయి. రాయబారం అంటే కృష్ణరాయబారమే అనే స్థాయికి చేరింది. ఆ తరువాత అంతే స్థాయిని కలిగినది సంజయ రాయబారం. కేవలం ఈ రెండు రాయబారాల గొప్పతనం వల్ల *మహాభారతం*లో ఎన్ని రాయబారాలు ఉన్నా అవన్నీ విస్మరణకు గురి అయ్యాయి. ఎవరికీ తెలియకుండాపోయాయి. భారతం తెలిసిన వాళ్ళకు సైతం ఉద్యోగపర్వంలో ఉన్న కృష్ణసంజయ రాయబారాలు తప్ప వేరేవి లేవని అనిపిస్తుంది. కానీ భారతంలో చాలా రాయబారాలు ఉన్నాయి. అవి రాయబారం అనే పేరుతో లేకపోయినా రాయబారాలు ఏం చేస్తాయో ఆ పనులే చేసినవి. వాటిని గుర్తించాలి అంటే ముందు రాయబారం అంటే ఏమిటో, రాయబారుల లక్షణాలు ఏమిటో తెలియాలి. అప్పుడు భారతంలో విస్మరించబడిన రాయబారాలను గుర్తించడం తేలిక అవుతుంది.

భారతంలో రాయబార పదవి అంటూ ఏదీలేదు. కానీ ఒక ప్రధానమైన రాజకార్యాన్ని నిర్వహించడానికి, లేదా సమాచారమందించడానికి రాజు ఒక వ్యక్తిని దూతగా నియోగించి పంపేవాడు. ఆ దూతనే మనం రాయబారి అంటున్నాం. రాయబారాన్నే దౌత్యం అంటున్నాం. ఈ వ్యాసంలో రాయబారి అన్నా దూత అన్నా ఇద్దరూ ఒకరే అని గుర్తించాలి. దూత అంటే వార్తాహరుడని చెప్పవచ్చు. యజ్ఞయాగాలలో అగ్ని యాజకులకు, దేవతలకు మధ్య దూతగా వ్యవహరించేవాడు. దేవతలు అగ్ని ముఖం ద్వారా హవిస్సు స్వీకరిస్తారని ఋగ్వేదం చెబుతోంది. కాబట్టి అగ్ని కూడా రాయబారిసే.

*మహాభారతం*లో ఎన్నో సందర్భాలలో రాయబార సన్నివేశాలు కనిపిస్తున్నా చాలా ముఖ్యమైన వాటిగా మూడిటిని మాత్రమే సాహితీవేత్తలు గుర్తించారు అవి 1. యజ్ఞయాగాలకు ఆహ్వానించేటపుడు, 2. రాజ్య తగాదాలను పరిష్కరించుకోవడానికి, 3. యుద్ధం ప్రారంభించబోయే ముందు తుది హెచ్చరికలు చేయడానికి. పూర్వకాలంలో ఎక్కువ శాతం పురోహితులు మాత్రమే ముఖ్యమైన సమాచారాన్ని అందజేయడానికి వార్తాహరులుగా ఉండేవారు. *మహాభారత* కాలానికి పురోహితులు, రాజనీతిజ్ఞులు, వాక్చతురులు

మొదలైనవారు దూతలుగా కనిపిస్తారు. అసలు దూత అని గానీ రాయబారి అని గానీ చెప్పడానికి కొలమానం వారికుండే లక్షణాలే. అందుకే మన శాస్త్రాలు దూతకు ఉండవలసిన లక్షణాలను చెప్పాయి.

**2. దూతల లక్షణాలు**

దూత లక్షణాలను గురించి *మనుస్మృతి, మహాభారతం* వంటి గ్రంథాలు వివరించాయి. అవి తెలుసుకోవడం వల్ల దౌత్య విధానం పట్ల కొంత అవగాహన ఏర్పడుతుంది.

**దూతం చైవ ప్రకుర్వీత సర్వ శాస్త్ర విశారదమ్**

**ఇంగితాకార చేష్టజ్ఞమ్ శుచిం దక్షం కులోద్గతమ్** *(మను. 7: 63)* అన్నది మనుస్మృతి. అంటే ఇంగితాకారచేష్టజ్ఞుడు (మానవ మనస్తత్వాన్ని, విభిన్న మానసిక పరిస్థితులలో మానవుని ఇంగిత చేష్టలను, హావభావాలను శీఘ్రంగా తెలుకోగలిగిన వాడు), సర్వశాస్త్ర విశారదుడు, శుచిమంతుడు, దక్షుడైనవాడు మాత్రమే దూత కావడానికి అర్హుడని, అటువంటి దూత మాత్రమే రాజకార్యాలు నిర్వహించగలడని మనువు అభిప్రాయం. ఆ దూత మాత్రమే పరరాజుల చేత కూడా గౌరవింపబడతాడు. అలాంటివాడు కార్యకార్యాలు తెలిసి చక్కగా దౌత్యాన్ని నిర్వర్తించగలడు.

**అనురక్తః శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాల విత్**

**వపుష్మాన్ వీత భీర్వాగ్మి దూతో రాజ్ఞః ప్రశస్యతే** *(మను. 7: 64)*

ఇక్కడ అనురక్తుడు అంటే జనుల అనురాగానికి పాత్రుడైనవాడు. శుచి అంటే ధనం, స్త్రీ విషయంలో లోలుడు కానివాడు. జ్ఞాపకశక్తి ఉన్నవాడు స్మృతిమంతుడు. దేశ కాల విత్ అంటే దేశ కాలాలను అనుసరించి సమయ సందర్భాలను బట్టి నడుచుకునే సామర్థ్యం కలవాడు. వపుష్మాన్ అంటే చక్కని రూపం కలిగినవాడు. వీత భీర్ అంటే ఏ విషయమైనా ధైర్యంగా చెప్పేవాడు. వాగ్మి అంటే మంచి మాటకారి. ఇలాంటి లక్షణాలు కలిగిన వారిని దూతగా నియమించాలని *మనుస్మృతి* చెబుతోంది.

*వ్యాసభారతం* దూత లక్షణాలను ఈ క్రింది విధంగా పేర్కొంది.

**అస్తబ్ధమక్లీబం మదీర్ఘసూత్రం**

**సానుక్రోశం శ్ల క్షమహార్య మన్యైః**

**అరోగజాతీయముదార వాక్యం**

**దూతం వదన్త్య ష్టగుణోపపన్నమ్"** *(వ్యాసభారతం, ఉద్యోగపర్వం, 37: 27)* అని దూతకు ఎనిమిది లక్షణాలను చెప్పింది. శాంతిపర్వం దూతకు ఏడు గుణాలుండాలని చెప్పింది.

**కులీనః శీలసంపన్నో వాగ్మీదక్షః ప్రియంవదః**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**యథోక్తవాదీ స్మృతి మాన్ దూతః స్యాత్ సప్తభిర్గుణైః** *(వ్యాస భారతం, శాంతిపర్వం, 85 :28).* తిక్కన కూడా ఈ ఏడు గుణాలనే పేర్కొన్నాడు. దూత మంచి నడవడిక కలిగి, ప్రియమైన మాటలతో రాజు యొక్క అభిప్రాయాన్ని శత్రురాజు వద్ద వివరించగలిగిన సమర్థుడై ఉండాలి. దూతకు వాక్చాతుర్యముండాలి. సమయస్ఫూర్తితో మెలగాలి శత్రురాజు దూతను ఎట్టి పరిస్థితులలోనూ చంపరాదు. అతనిని అవసరమైతే బంధించవచ్చు.

దూతకు ఉండాల్సిన ఎన్నో లక్షణాలను శాస్త్రాలు చెప్పాయి. వాటి ఆధారంగానే ప్రధానమైన రాయబారాలను ముఖ్యంగా ఉద్యోగపర్వంలోని రాయబారాలను మాత్రమే సమాజం రాయబారాలుగా గుర్తించింది. నిజానికి నన్నయ రచించిన ఆరణ్యపర్వంలోని నలోపాఖ్యానంలోనే మనకు చాలా రాయబారాలు లేదా దౌత్యాలు కనిపిస్తాయి. ఉద్యోగపర్వం దాటి కూడా అనేక రాయబారాలు కనిపిస్తాయి. అవన్నీ ఉద్యోగపర్వంలోని రాయబారాలకు సమానమైనవి కాకపోయినా అవి కూడా రాయబారాలే. అలాంటి వాటిలో కొన్నిటిని ఈ పత్రంలో విశ్లేషణ చేయడం ముఖ్య ఉద్దేశ్యం.

**3. హంసరాయబారం**

నలోపాఖ్యానంలో నలుడికి, దమయంతికి తొలి ప్రేమ చిగురించడానికి మధ్య మొట్టమొదట నలుడి గుణాలు దమయంతికి, దమయంతి గుణగణాలు నలుడికి చెప్పిన బ్రాహ్మణులు దూతలే. అన్నిటికంటే ముఖ్యంగా హంసరాయబారం. *మహాభారతం*లోని హంసరాయబారం చాలా ప్రత్యేకమైనది. అది నలదమయంతుల మధ్య అనురాగం పెరగడానికి, వారు కలవడానికి మాత్రమే కారణం కాదు. తెలుగుసాహిత్యంలో అనేక పక్షి రాయబార కథలు పుట్టడానికి మూలమైనది. భారతంలోని హంస రాయబారాన్ని అనుసరించి తెలుగుసాహిత్యంలో హంస, చిలుక మొదలైన పక్షుల రాయబారాలతో ఎన్నో కావ్యాలు వచ్చాయి. కాబట్టి హంస రాయబారం చాలా విశిష్టమైనది.

*మహాభారతం*లోని హంసను రాయబారిగా లేదా దూతగా పరిగణించాలా? లేదా? అనే మీమాంసకు ఏ మాత్రం తావులేదు. ఎందుకంటే మనుస్మృతి లోని

**దూత ఏవ హి సంధత్తే భినత్త్యేవచ సంహతాన్**

**దూతస్తత్కురుతే కర్మ, భిద్యంతే యేన వానవా** *(మను. 7:66)* అనే శ్లోకం దానికి సమాధానం. అంటే దూత ఇద్దరు రాజులను కలుపుతాడు. అవసరమైతే విడగొడతాడు. ఇంకొక రాజు దగ్గరకు మారువేషంలో వెళ్ళి అతని మనస్సును గ్రహించగలుగుతాడు. ఈ దూత లక్షణాలలో ఇద్దరిని కలిపే పని, అవతలి వారి మనస్సును కనుగొనే పని కూడా ఉంది. ఆ లక్షణాలు స్పష్టంగా హంసకు కూడా సరిపోతాయి. అంతే కాదు **"అదియును దన కమ్మనుజేశ్వరుఁ డపాయంబు సేయుంగా వగచి మనుష్య వాక్యంబుల నిట్లనియె: 'నయ్యా! యేను నీకుం బ్రియంబు సేసెద; నీ హృదయేశ్వరియైన దమయంతి పాలికిం బోయి నీ గుణంబులు దానికి వర్ణించి యక్కన్య**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**యన్యుల నపేక్షింపక నీయంద బద్ధానురాగ యగునట్లుగాఁ జేసెద."** *(ఆరణ్య. 2 : 14)* అని నన్నయ కూడా హంస చేత మానవ సంభాషణ చేయిస్తాడు. ఆ సంభాషణలో హంస నలుడితో "అయ్యా నేను నీ హృదయేశ్వరి అయిన దమయంతి దగ్గరకు వెళ్ళి నీ గుణాలను చెప్పి దమయంతికి నీ పట్ల అనురాగం కలిగేటట్లు చేస్తా"నని చెబుతుంది. ఇక్కడ హంసమాటలను గమనిస్తే మనుస్మృతి చెప్పిన ఇద్దరిని కలపడం అనే దూతలక్షణం కనిపిస్తుంది.

**క. దమయంతికి నలునకు సం**
**గమకారణ దూతయైన కలహంస మనో**
**జ్ఞమనుష్య వాక్యముల న**
**ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా ని ట్లనియెన్.** *(ఆరణ్య. 2 : 18)*

**నీ హృదయేశ్వరుండైన నలునొద్దనుండి వచ్చితి; నపార పారావార పర్యం తానంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరు లేరు; సర్వగుణ సౌందర్యంబుల నెవ్వరు నలుం బోలరు.** *(ఆరణ్య. 2 : 19)* అంటూ అనేక రకాలుగా నలుని గుణగణాలు చెబుతుంది. అంతే కాదు దమయంతి కోరిక మేరకు దమయంతి విషయాలను కూడా నలుడికి అందిస్తుంది. అదే ఇద్దరు వ్యక్తులను కలిపే దూత లక్షణం. అందుకే నన్నయ పై పద్యంలో హంసను "**దమయంతికి నలునకు సం/గమకారణ దూతయైన కలహంస**" అన్నాడు. అంటే హంస నలదమయంతులను కలిపే ఒక గొప్ప దూత. విస్మరించబడిన రాయబారి.

**4. నలరాయబారం**

నలోపాఖ్యానంలో మరో రాయబారం నలుడి రాయబారం. దమయంతి స్వయంవరానికి వచ్చిన ఇంద్రాదుల పక్షాన దమయంతి దగ్గరకు రాయబారిగా వెళతాడు.

**సీ. 'నిత్యసత్యవ్రత! నిషధేశ! నీవు మా**
**కమరంగ దూతవై యభిమతంబు**
**సేయుము' నావుడుఁ జెచ్చెర 'నట్టుల**
**చేయుదు మఱి నాకుఁ జెపుఁడు మీర**
**లెవ్వార? లేను మీ కిష్టంబుగా దూత**
**నై యేమి సేయుదు?' ననిన, నతని**
**కమరేశ్వరుం డిట్టు లనియె; 'నే నింద్రుండ;**
**వీరు దిక్పాలురు విదితయశులు;**

**ఆ. ధరణి నొప్పుచున్న దమయంతి సుస్వయం**

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

**వరముఁ జూచు వేడ్క వచ్చియున్న**
**వార; మీవు మమ్ము వారిజాక్షికి నెఱిం**
**గింపు నామధేయ కీర్తనముల.** *(ఆరణ్య 2:34)*

పై పద్యంలో దమయంతి స్వయంవరానికి వచ్చిన ఇంద్రాది దేవతలు నలుడితో వారికి దూతగా వ్యవహరించమని కోరుతారు. వారి గుణగణాలను, బిరుదులను దమయంతి ముందు పొగిడి వారిలో ఎవరినైనా దమయంతి వరించేలా చేయమని కోరుతారు.

**ఆ. వె. నిన్ను నిత్యసత్యనిరతుఁగా నెఱిఁగి యి**
**క్కార్యమునకు వలనుగలుగు టెఱిఁగి**
**పనుప వలసె <u>దూతభావ</u> మపేక్షించి;**
**దేవహితము, దీనిఁ దీర్పవలయు.** *(ఆరణ్య 2: 37)* అనే పద్యంలో కూడా నలుడిని దూతగా ప్రస్తావన చేస్తారు. తరువాత ఇంద్రాది దేవతల పక్షాన నలుడే స్వయంగా రాయబారిగా దమయంతి దగ్గరకు వెళతాడు. గొప్ప తేజస్సు కలిగిన నలుడిని చూసి దమయంతి ఎవరు మీరని ప్రశ్నిస్తుంది. దానికి నలుడు

**ఆ. వె. 'ఏను <u>దేవదూత</u> నింతి! నలుం డను**
**వాఁడ; నింద్రదహన వరుణ యములు**
**నీ స్వయంవరంబు నెమ్మితోఁ జూడంగ**
**నరుగుదెంచి నన్ను నబల! మున్న** *(ఆరణ్య 2: 44)* అని తనను తాను దేవ దూతగా చెప్పుకుంటాడు. ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, యముడు మొదలైన వారి గుణాలను చెప్పి వారిలో ఎవరినైనా పెళ్ళిచేసుకోమని కోరతాడు. దానికి దమయంతి ఇచ్చిన సమాధానాలు విని, ఒక దూతగా వచ్చి వాటినే ఇంద్రాదులకు పొల్లు పోకుండా చెబుతాడు. ఇక్కడ నలుడు పోషించినది స్వయంగా దూత పాత్ర. అది కూడా ఒక గొప్ప రాయబారమే. నలుడిలో కూడా శాస్త్రాలు చెప్పిన దూత లక్షణాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. కానీ నలుడి రాయబారం అంత ప్రాచుర్యం పొందలేదు.

### 5. నలోపాఖ్యానంలో ఇతర రాయబారాలు

హంస, నలుడే కాదు. నలోపాఖ్యానంలో ఇంకా చాలా రాయబారాలు కనిపిస్తాయి. రాజ్యం కోల్పోయి అడవుల పాలైన నలదమయంతులను వెతకమని దమయంతి తండ్రి భీముడు బ్రాహ్మణులను నియోగిస్తాడు. వారిలో సుదేవుడు అనే బ్రాహ్మణుడు చేదిరాజు సుబాహువు ఆస్థానంలో సైరంధ్రిగా ఉన్న దమయంతిని చూస్తాడు. ఆమెకు తల్లిదండ్రుల, బిడ్డల యోగక్షేమాలు చెబుతాడు. దమయంతి తిరిగి పుట్టిన దేశమైన విదర్భకు వెళ్ళడానికి కారకుడవుతాడు. అదే సుదేవుడు అయోధ్య రాజైన ఋతుపర్ణుని ఆస్థానంలో

అశ్వపాలకుడిగా ఉన్న నలుడు విదర్భ రావడానికి దమయంతికి ద్వితీయ స్వయంవరం జరుగుతున్నదన్న వార్తను తీసుకువెళతాడు.

కురూపిగా ఉన్న నలుని గురించి పూర్తిగా తెలుసుకోవడానికి దమయంతి కేశిని అనే దూతికను నియమిస్తుంది. పర్ణాదుడు కొంత, దాసి అయిన కేశి కొంత ఇద్దరూ కలిపి నలదమయంతులను కలపడంలో తమవంతు పాత్ర పోషిస్తారు. వారిని కూడా ఇక్కడ దూతలుగా, రాయబారులుగా గుర్తించాలి.

**6. రామకథలోని రాయబారాలు**

*మహాభారతం*లోని ఆరణ్యపర్వంలోనే రామాయణం ఉంటుంది. వాలి మరణానంతరం ఇచ్చిన మాటను మరచిపోయిన సుగ్రీవుడి దగ్గరకు రాముని తరఫున లక్ష్మణుడు రాయబారిగా వెళతాడు. అక్కడ లక్ష్మణుడు చేసినది కూడా దౌత్యమే. సీతను వెతకడానికి వెళ్ళిన వానరులందరూ దూతలే. సీత జాడను వెతుకుతూ లంకకు వెళ్ళిన హనుమంతుడు కూడా రాయబారినే. రావణాదులకు తాను రామదూతను అని హనుమంతుడు చెప్పుకుంటాడు.

> **వ. ఇట రాఘవుండును సుగ్రీవసహితుండై యుండి యంగదుం జూచి 'నీవు రావణుపాలికిం జని యతనికిం దగినతెఱంగున బుద్ధిగాఁ జెప్పి, జానకి విడుచుట మే లని చెప్పు' మని పనిచినం బని పూని యవ్వీరుండు.** *(ఆరణ్య. 7:58 )* అంటూ అంగదుడుని రాముడు తానే స్వయంగా రాయబారిగా నియమిస్తాడు. రాముని ఆజ్ఞ మేరకు అంగదుడు లంకకు వెళతాడు. రాయబారిగా తన బాధ్యతను నెరవేర్చుతాడు. నిజానికి వానరుల రాయబారాలు చాలా గొప్పవి. కానీ వారి విషయం *రామాయణం*లోనిది కాబట్టి భారతంలో వారి రాయబారాలకు అంత ప్రాధాన్యం దక్కలేదు.

**7. మహాభారతంలోని ఇతర రాయబారాలు**

పైన చెప్పుకున్న రాబారాలు మాత్రమే కాకుండా *మహాభారతం*లో ఇంకా చాల రాయబారాలు ఉన్నాయి. వాటిలో శ్రీకృష్ణ, సంజయ రాయబారాల వంటి ప్రసిద్ధ రాయబారాలతోపాటు మరికొన్ని రాయబారాలు ఉద్యోగపర్వంలోనే మనకు కనిపిస్తాయి.

1. ఉద్యోగపర్వంలో ద్రుపద పురోహితుడు పాండవులకు అర్ధరాజ్యమివ్వమని అడగడానికి కౌరవసభకు దూతగా వెళతాడు.
2. ద్రుపద పురోహితుని మాటలు విన్న తరువాత కౌరవపక్షం నుండి సంజయుడు పాండవుల దగ్గరకు రాయబారిగా పంపబడతాడు.
3. ఆ తరువాత శ్రీకృష్ణుడు పాండవుల పక్షం నుండి రాజ్యమివ్వకపోతే యుద్ధం అనివార్యమని చెప్పడానికి కౌరవసభకు రాయబారిగా వెళతాడు.
4. ద్రుపదుని వద్దనున్న పాండవుల కోసం ధృతరాష్ట్రుడు విదురుని దూతగా పంపుతాడు.

5. దుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధానికి ముందు కంటి తుడుపు చర్యగా పాండవుల వద్దకు ఉలూకుని దూతగా పంపుతాడు.

6. కురుక్షేత్ర యుద్ధ సమయంలో తమతమ పక్షాలలో చేరవలసినదిగా కోరుతూ ధర్మరాజు దుర్యోధనులు వివిధ రాజుల వద్దకు దూతలను పంపిస్తారు.

7. విరాటపర్వంలో బ్రాహ్మణవేషాలలో ఉన్న పాండవులను గుర్తించడానికి ద్రుపదుడు తన పురోహితుని దూతగా పంపిస్తాడు.

8. సభాపర్వంలో పాచికలాడేందుకు రమ్మని ధృతరాష్ట్రుడు పాండవుల వద్దకు విదురుని దూతగా పంపిస్తాడు.

9. సభాపర్వంలో రాజసూయ యాగానికి రమ్మని వివిధ దేశాధీశుల వద్దకు ధర్మరాజు దూతలను పంపిస్తాడు.

10. ఆరణ్యపర్వంలో వైష్ణవయాగ సమయంలో రాజులను ఆహ్వానించడానికి దుర్యోధనుడు దూతలను పంపిస్తాడు.

11. ఆరణ్యపర్వంలో ముద్గలుని స్వర్గానికి రమ్మని విమానం తీసుకొని దేవదూత వస్తాడు.

12. కృష్ణుడు ద్వారకానగరవాసులను రక్షించమని చెబుతూ రథసారథి దారుకుని అర్జునుని వద్దకు దూతగా పంపుతాడు.

ఇలా *మహాభారతంలో* ఎన్నో రాయబారాయలు ఉన్నాయి. పైన చెప్పిన వారే కాకుండా *మహాభారతంలో* ఇంకా అనేక సందర్భాలలో దూతలు తమ కార్యాలను అతి సమర్థవంతంగా నిర్వహించారు. ఆ రాయబారాలన్నిటినీ విస్మరించకుండా అధ్యయనం చేసి అవసరాన్ని బట్టి నేటి సమాజానికి, ప్రభుత్వం అనుసరిస్తున్న దౌత్య విధానాలకు అనుసంధానం చేయడం చాలా అవసరం. తద్వారా అనేక ప్రయోజనాలు నెరవేరడంతోపాటు దేశ శాంతిభద్రతలు కాపాడబడతాయి.

## 8. ఉపయుక్త గ్రంథాలు

### 8. 1 తెలుగు

1. ఎఱ్ఱన. (2013). *శ్రీమదాంధ్ర మహాభారతము (ఆరణ్యపర్వం)* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణలు.

2. కృష్ణ గాయత్రి, ద్వివేది. (2002). *వ్యాసుడు – తిక్కన – మహాభారత రాజనీతి దర్శనం.* హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించబడిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.

3. గోదావరి బాయి, సంధ్యావందనం. (1988). *భారతము – రాజనీతి విశేషాలు.* అనంతపురం: రచయిత్రి స్వీయ ప్రచురణ.

4. తిక్కన. (2013). *శ్రీమదాంధ్ర మహాభారతము (విరాట ఉద్యోగపర్వాలు)* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణలు.

5. నన్నయ. (2013). *శ్రీమదాంధ్ర మహాభారతము (సభా, ఆరణ్యపర్వాలు)* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణలు.

6. రఘునాథశర్మ, శలాక. (1989). *శ్రీమన్మ మహాభారతము ఉద్యోగపర్వం* . హైదరాబాదు: రచయిత స్వీయ ప్రచురణ.

7. రామకృష్ణమాచార్య, నండూరి. (1969). *తిక్కన భారత దర్శనము*. హైదరాబాదు: ప్రగతి గీతా ప్రెస్.

8. శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2012). *మహాభారతసారసంగ్రహము*. హైదరాబాదు: శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్.

**8. 2 సంస్కృతం**

1. వేదవ్యాసుడు. (2012). *మహాభారతం (శాంతి పర్వం)*. గోరక్ పూర్: గీతాప్రెస్ ప్రచురణ.

2. లక్ష్మీ నరసింహాచార్యులు, నల్లందిఘళ్ (తెలుగు వ్యాఖ్యాత). (2000). *మనుస్మృతి*. హైదరాబాదు: గాయత్రీ ప్రచురణలు.